క్లుప్తంగా

డైట్ అధ్యాపకుడిగా ఎంపిక


పాండ్రంకి కృష్ణ

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పాండ్రంకి కృష్ణ వమరవల్లి డైట్ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డైట్‌లో డిప్యూటేషన్‌పై పనిచేసేందుకు అధ్యాపకుల భర్తీ కోసం ప్రిలిమనరీ పరీక్ష నిర్వహించింది. ఇందులో ప్రతిభ చూపారు. ఇంటర్వ్యూలో సైతం ఎంపికయ్యారు. ఎడ్‌సెట్‌లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకర్‌గా, స్పెషల్ బీఈడీలో ప్రథముడుగా నిలిచారు. తొలుత రైల్వే ఉద్యోగానికి ఎంపికయ్యారు. కొద్దిరోజులు పనిచేసిన తరువాత ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో డీఎస్సీ రాసి ఎంపికయ్యారు. ఇప్పుడు డైట్ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. ఈయన ఎంపికపై హెచ్ఎం తూలుగు కేశవరావు, పాఠశాల ఇన్‌చార్జి అరుణ, ఉపాధ్యాయ సిబ్బంది కాంతిరాజు, పీఎంసీ సభ్యులు అభినందనలు తెలిపారు.

జాబ్ మేళా రేపు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ పి.లత బుధవారం తెలిపారు. ఐటీఐ, డిప్లమా, పదో తరగతి, డిగ్రీ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 ఏళ్ల వయసు గలవారు అర్హులన్నారు. ఉదయం పది గంటలకు కళాశాల వద్దకు చేరుకోవాలన్నారు. 12 కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్ ప్రతినిధులు హాజరవుతారన్నారు. 615 ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, బయోడేటా జిరాక్స్, పాస్ పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ 99499 00672, 94932 90012 నంబర్లను సంప్రదించాలన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ


అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న దళిత నాయకులు

పాతపట్నం: మండలంలోని బైదలాపురం పీహెచ్‌సీలో టెక్కలి ఇన్‌చార్జి డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు బుధవారం అట్రాసిటీ కేసుపై విచారణ చేపట్టారు. బైదలాపురం పీహెచ్‌సీలో గతంలో డాక్టర్‌గా జి.సదాశివ(రిటైర్డ్) పనిచేశారు. ప్రస్తుతం ఇదే పీహెచ్‌సీలో డాక్టర్‌గా పనిచేస్తున్న సత్యవాణిని సదాశివ బెదిరింపులకు పాల్పడి, కులం పేరుతో దూషించినట్లు ఆమె ఇటీవల ఫిర్యాదు ఇచ్చారు. ఈ ఫిర్యాదుకు సంబంధించిన వాస్తవ పరిస్థితులను అడిషనల్ ఎస్పీ ఆరా తీశారు. సీఐ రామారావు, ఎస్ఐ లావణ్య పాల్గొన్నారు. పాతపట్నం పోలీస్ స్టేషన్‌లో అడిషన్ ఎస్పీకి దళిత సంఘాల జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. దళితులను దూషించిన సదాశివను తక్షణమే అరెస్ట్ చేయాలని దుర్గాసి గణేష్, కృష్ణయ్య, యడ్ల గోపి, పసుపురెడ్డి భాస్కరరావు, బాడాన వెంకటరావు డిమాండ్ చేశారు.

వీల్‌చైర్లు పంపిణీ


వీల్‌చైర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: స్థానిక ఎమ్మార్సీ వద్ద సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగ చిన్నారుకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం వీల్‌చైర్లు అందజేశారు. ముందుగా బీసీ కమ్యూనిటీ హాల్‌లో బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మండలంలోని కొరసవాడ నుంచి శివరాంపురం గ్రామానికి రూ.70 లక్షల ఉపాధి నిధులతో బీటీ రహదారికి శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ చంద్ర కుమారి, ఎంఈఓ తిరుమలరావు, ఈఓపీఆర్డీ వెంకటరావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

టేకు దుంగల పరిశీలన


టేకు దుంగలను పరిశీలిస్తున్న రెవెన్యూ, అటవీ సిబ్బంది

బూర్జ: మండలంలోని ఏపీపేట పంచాయతీ గోపిదేవిపేట రెవెన్యూ పరిధిలో ఇటీవల డీపట్టా భూముల్లో 23 టేకు మొక్కలు నరికి దుంగలను పోగు చేశారు. స్థానికుల పిర్యాధుతో రెవెన్యూ సిబ్బంది, శ్రీకాకుళం అటవీశాఖ సెక్షన్ సిబ్బంది బుధవారం వెళ్లి పరిశీలించారు. గిరిజన రైతులకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమతులు లేకుండా నరికిన టేకు దుంగలు తరలించకుండా చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపట్టనున్నట్లు సిబ్బంది వివరించారు. శ్రీకాకుళం అటవీశాఖ సెక్షన్ అధికారులు ఎం.సాయిరాం, గార్డ్ జయరాం, సిబ్బంది, వీఆర్వో ఎం.ఉమామహేశ్వరరావు, సచివాలయం సర్వేయర్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మగెడ్డ ఆక్రమణ


ఆక్రమణలతో రూపుకోల్పోతున్న గుమ్మగెడ్డ

- గండ్లుపడి రూపుకోల్పోతున్న వైనం
- ఏటా తప్పని ముంపు
- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు


గుమ్మగెడ్డలో తామర వద్ద ఉపాధి పనులు చేసిన దృశ్యం

పాతపట్నం: చెరువులు, కాలువలు, ప్రభుత్వ స్థలాలు ఎక్కడ ఉన్నా కబ్జాకు గురవుతున్నాయి. కొంతమంది వీటిని ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నారు. వీటిని అరికట్టాల్సిన అధికారులు అటువైపు చూడటం లేదనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పాతపట్నం మండలం సీది వద్ద ఉన్న గుమ్మగెడ్డ సుమారు 2 వేల ఎకరాలకు పైగా పంట పొలాలకు సాగునీరు అందిస్తుంది. ప్రస్తుతం గుమ్మగెడ్డ ఆక్రమణదారుల చెరలో చిక్కుకుంది. ప్రతిఏటా వర్షాకాలంలో గండ్లు పడి చివరికి రూపం కోల్పోయింది. తరచూ చాకిపల్లి, ఎ.ఎస్.కవిటి, రొంపిలస సమీపంలో గండ్లు పడుతూనే ఉన్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి మరమ్మతులు చేపడుతున్నారు. శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టకపోవడంతో గండ్లు పడిన చోటే మళ్లీ గండ్లు పడుతుండటంతో ప్రతీఏటా వందలాది ఎకరాల పంట నీట మునుగుతుంది. విస్తీర్ణం కోల్పోయిన గుమ్మగెడ్డలో ఆక్రమణలకు పాల్పడుతుండటంతో పూర్తిస్థాయిలో స్వరూపమే కోల్పోయింది. గెడ్డ లోతు పెంచే పనులను, పిచ్చి మొక్కలను నరికివేసే కార్యక్రమాన్ని ఉపాధి పథకం ద్వారా చేపడుతున్నారు. లోతు పెరగడం లేదు సరికదా పక్కనే మట్టి వేస్తుండడంతో గట్టు వెడల్పు కూడా తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలను తొలగించాలి



గుమ్మగెడ్డ రైతుల పాలిట వరంగా ఉండేది. అటువంటి గుమ్మగెడ్డను కొంతమంది ఆక్రమించి స్వరూపమే మార్చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. వేలాది ఎకరాలకు సాగు నీరందించే గుమ్మగెడ్డను పరిరక్షించాలి.

– మద్ది నారాయణరావు, రైతు, పెద్దసీది, పాతపట్నం మండలం

శాశ్వత పరిష్కారం చూపాలి



గుమ్మగెడ్డకు ప్రతిఏటా గండ్లు పడుతూ వందలాది ఎకరాల పంట నీట మునుగుతుంది. దీంతో రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన పనులను చేపట్టాలి.

– పడాల శాంతారావు, రైతు, తామర, పాతపట్నం మండలం

వైఎస్ జగన్‌ను కలిసిన కిల్లి



మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విజయవాడలో గల పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి, విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితిపై జగన్ మోహన్‌రెడ్డి ఆరా తీశారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

– ఆమదాలవలస

• శభాష్ భారత్..



జమ్మూలో పర్యాటకులపై పాక్ ఉగ్రవాదులు చేసిన నరమేదానికి ప్రతీకారంగా భారత సైనికులు పాక్‌లోని ఉగ్ర శిబిరాలపై మంగళవారం రాత్రి దాడి చేసి మట్టుబెట్టడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. నరసన్నపేట జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం ఉదయం స్థానిక విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు జాతీయ జెండాలు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ దాడుల్లో పాల్గొన్న సైనికులకు సెల్యూట్ చేశారు. శభాష్ భారత్ అని అభివర్ణించారు.

– నరసన్నపేట

టెక్నికల్ అసిస్టెంట్ మాకొద్దు

- ఉపాధి వేతనదారుల ఆందోళన


పెద్దపద్మాపురంలో అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో సమావేశమైన వేతనదారులు

మెళియాపుట్టి: ఉపాధి పథకంలో కనీసం ఎంబుక్ రాసే అథారిటీ లేని వ్యక్తి బీఎఫ్‌టీ (బేర్ ఫుట్ టెక్నీషియన్)ను టెక్నికల్ అసిస్టెంట్‌గా బాధ్యతలు అప్పగించడంతో.. వేతనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని పెద్దపద్మాపురం గ్రామంలోని టెక్నికల్ అసిస్టెంట్ (బీఎఫ్‌టీ) మాటతీరు బాగోలేదని, పనుల వద్దకు వచ్చి దుర్భాషలాడుతున్నాడని వేతనదారులు బుధవారం ఆందోళనకు దిగారు. గ్రామంలో సమావేశమయ్యారు. ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి హాజరవ్వడంతో సమస్యను వివరించారు. టెక్నికల్ అసిస్టెంట్ పడాల వెంకటరమణ పనుల వద్దకు వచ్చి మేట్లు, వేతనదారులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, నాకు నచ్చిన విధంగా ఉంటాను.. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని భయపెడుతున్నట్లు వేతనదారులు తెలిపారు. ఇదే విషయంపై ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. బీఎఫ్‌టీ వెంకటరమణను విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు.

చర్యలు తీసుకుంటాం



వేతనదారులను దుర్భాషలాడటం సరికాదు. వెంకటరమణపై చర్యలు తీసుకుంటాం. ఈ సమస్యపై సమగ్ర విచారణ జరిపి, డ్వామా పీడీకి నివేదిస్తాం. ఇటువంటి చర్య పునరావృతం కాకుండా చూస్తాం.

– నరసింహప్రసాద్ పండా, ఎంపీడీఓ, మెళియాపుట్టి

తాగునీటికి అవస్థలు


పనిచేయని మంచినీటి పథకం మోటారు

సారవకోట: మండలంలోని కొమ్మసరియాపల్లి పంచాయతీ పెద్దగుజ్జువాడలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకం వారం రోజులుగా పనిచేయడం లేదు. బోర్లు, బావులపై ఆధారపడాల్సి వస్తోంది. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోర్లు, బావులు సైతం అంతంత మాత్రంగా పనిచేస్తున్నాయని, తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచినీటి పథకానికి ఏర్పాటు చేసిన మోటార్ పనిచేయడం లేదన్నారు. గతంలో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ వేసిన కుళాయిలు దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయన్నారు.

ఫారం పాండ్ల ఏర్పాటుకు స్థల పరిశీలన

పొందూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఫారం పాండ్లు ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేస్తున్నామని ఎంపీడీఓ మీసాల మన్మథరావు తెలిపారు. బుధవారం పొందూరు పైడికొండ సమీపంలో స్థల పరిశీలన చేశారు. మండలానికి 280 ఫారంపాండ్లు తవ్వకాలు లక్ష్యంగా చేసుకున్నామన్నారు. వాటిలో 105 ఫారం పాండ్లు పనులు ప్రారంభించామన్నారు. 55 పూర్తి చేశామని, 175 ఫారంపాండ్లను గుర్తించాల్సి ఉందన్నారు. ఫారంపాండ్ 8 మీటర్లు పొడవు, వెడల్పు, నాలుగున్నర అడుగుల లోతు తవ్వితే రూ.40 వేలు, ఇన్‌లెట్ నిర్మాణంలో రాతి కట్టుకు రూ.20 వేల నిధులు మంజూరవుతాయన్నారు. ఏపీఓ శ్రీనివాసరావు, ఏటి బెండి బాబ్జి, టీఏ ఎస్.ఈశ్వరరావు, ఎఫ్ఏ రాంబాబు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ కోచింగ్ ప్రారంభం

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం ఫుట్‌బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభమైంది. నెల రోజులపాటు నిర్వహిస్తామని కోచ్ అనిల్ తెలిపారు. క్రీడాకారులకు పొట్నూరు రమేష్, తదితరులు జెర్సీలు, ఫుట్‌బాల్ బాల్‌ను అందజేశారు. బంకుపల్లి రవి, రాకేష్, నివాస్, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ

కొత్తూరు: మండల కేంద్రానికి చెందిన కోగాన పద్మ ఇల్లు ఇటీవల అగ్నిప్రమాదంలో కాలి బూడిదైంది. బాధితరాలుకు ప్రభుత్వం ద్వారా బియ్యాన్ని పీఎస్ డీటీ భీమారావు, ఉప తహసీల్దార్ నారాయణరావు బుధవారం అందజేశారు. కొత్తూరుకు చెందిన సామాజికవేత్త పడాల లక్ష్మణరావు రెండు చీరలు, రెండు దుప్పట్లు అందజేశారు.

అల్లూరి పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం


అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ త్రినాథులు

ఎల్.ఎన్.పేట: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమని ఎల్.ఎన్.పేట జెడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాథులు అన్నారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణం వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి బుధవారం నివాళులర్పించారు. మన్యం వీరుడుగా పేరు సంపాదించిన అల్లూరి చిన్న తనంలోనే బ్రిటీష్ వారిని ఎదురించాడన్నారు. యంబరాం సర్పంచ్ వెలమల గోవిందరావు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎం.కె.మిశ్రో, పి.రామరాజు, కెల్ల గణపతి, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పేరుతో కుచ్చుటోపీ


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: కుట్టుమిషన్ల పేరుతో కూటమి ప్రభుత్వం సుమారు రూ.245 కోట్ల అక్రమాలకు పాల్పడిందని పాతపట్నం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు అగతమూడి నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు ఆరోపించారు. కొత్తూరులో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా మహిళలకు కొత్తూరులో ఇస్తున్న కుట్టుమిషన్ల శిక్షణ కార్యక్రమం కూటమి నేతలకు ఉపాధి కల్పిస్తోందన్నారు. దీని వల్ల మహిళలకు ఏ మాత్రం ఉపయోగం లేదన్నారు. శిక్షణ పేరుతో కూటమి నాయకులు ప్రభుత్వ ఖజానాను లూటీ చేస్తున్నారన్నారు. నాణ్యతలేని కుట్టుమిషన్లు కొనుగోలు చేస్తున్నారన్నారు. కుట్టుమిషన్ల శిక్షణలో కూటమి ప్రభుత్వం చేసిన అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు బొమ్మాళి నగేష్, పాపారావు పాల్గొన్నారు.

జన జాతర

- ముగిసిన సిరిమాను ఉత్సవాలు..
- చివరి రోజు కిటకిటలాడిన మాకివలస


మాకివలస ప్రధాన రహదారి పొడుగునా ఉన్న జనాలు


దేవాది-మాకివలస మధ్య నిలిచిన వాహనాలు

నరసన్నపేట: మండలంలోని మాకివలసలో వారం రోజులుగా నిర్వహిస్తున్న అసిరితల్లి సిరిమాను ఉత్సవం బుధవారంతో ముగిసింది. చివరి రోజు గ్రామంలో విందు ఏర్పాటు చేయడంతో బంధువులు, స్నేహితులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మాకివలసలోని వీధులన్నీ కిటకిటలాడాయి. దేవాది కూడలి, మబగాం, గోపాలపెంట నుంచి మాకివలస వరకు దారి పొడుగునా జనాలు కనిపించారు. దేవాది నుంచి పలుచోట్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించినా ఫలితం లేకపోయింది. ఉత్సవాలకు సహకరించిన వారందిరికీ సర్పంచ్ మోహన్‌రావు ఎంపీటీసీ సభ్యుడు యాళ్ల అప్పలనాయుడు, కిళ్లాం నీటి సంఘం అధ్యక్షుడు శిమ్మ చంద్ర, మాజీ ఎంపీపీ శిమ్మ పార్వతమ్మ, మాజీ సర్పంచ్ యాళ్ల వేణు కృతజ్ఞతలు తెలిపారు.

కాలువ పరిశీలన

ఎల్.ఎన్.పేట: వంశధార కుడి ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న 7ఎల్ పిల్ల కాలువను వంశధార డీఈ రామకృష్ణ బుధవారం పరిశీలించారు. మండలంలోని కోవిలాం వద్ద కాలువ గట్లును పరిశీలించారు. కాలువలో పూడికలు తొలగించటంతోపాటు గట్లును బలపర్చాలని డీఈని స్థానిక రైతు నడిపల్లి నారాయణరావు కోరారు. సాగునీటి ప్రవాహ వేగానికి గట్టు బలహీనంగా ఉన్న చోట గండ్లు పడుతున్నాయని వివరించారు. గండి పండిన చోట పంటకు నష్టం జరగడంతోపాటు సాగునీరు వృథాగా పోతుందన్నారు. గట్టు బలహీనంగా ఉన్న చోట సిమెంట్ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, ప్రతీ ఎకరానికీ సాగునీరు అందిస్తామని డీఈ తెలిపారు. వంశధార ఏఈలు ఉన్నారు.

నరకయాతన

- రోడ్డు బాగుపడేది ఎప్పుడు..
- రాళ్లు తేలడంతో రాకపోకలకు ఇబ్బంది


రాళ్లు తేలిపోయి అధ్వానంగా ఉన్న జాడుపేట రోడ్డు


మెటల్ రాళ్లు వేసి ఏడాదిగా వదిలేసిన సిద్ధాంతం రోడ్డు

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. రోడ్లు బాగుపడేది ఎప్పుడా? అని ఆయా గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఏబీ (అలికాం–బత్తిలి) రోడ్డు నుంచి ఐదు కిలో మీటర్లు దూరంలో ఉన్న జాడుపేటకి వెళ్లే రోడ్డులో రాళ్లు తెలిపోవటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆటోలు, 108 అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి. అంబులెన్స్ వచ్చినా ఐదు కిలో మీటర్లు ప్రయాణించేందుకు 30 నిమిషాలు పడుతుంది. మండలంలోని సిద్ధాంతం రోడ్డుదీ ఇదే పరిస్థితి. ఏబీ రోడ్డు నుంచి సిద్ధాంతం గ్రామం వరకు ఉన్న నాలుగు కిలో మీటర్ల రోడ్డు బాగు కోసం నిధులు ఉన్నప్పటికీ.. ఇంజినీరింగ్ అధికారులు నిర్మాణ పనులు చేపట్టకుండా జాప్యం చేస్తున్నారు. సిద్ధంతం సర్పంచ్ గాది కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు త్రిపురాన లక్ష్మణరావు, గాది వెంకటరావుతోపాటు పలువురు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు నిర్మాణం పేరుతో ఏడాది క్రితం మెటల్ వేసి వదిలేశారు. ఇప్పటికైనా పాలకులు, ఇంజినీరింగ్ అధికారులు స్పందించి జాడుపేట, సిద్ధాంతం రహదారుల పనులు తక్షణమే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏడాదికి పైగా..

రోడ్డు మరమ్మతు పేరుతో అలికాం–బత్తిలి రోడ్డు నుంచి సిద్ధాంతం వరకు రోడ్డును తవ్వేసి సుమారు అరు నెలలపాటు వదిలేశారు. ఆ తరువాత మిక్సింగ్ మెటల్ వేసి పది నెలలుగా వదిలేశారు. రోడ్డు పైన ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. అత్యవసర పరిస్థితుల్లో ఆటోలు కూడా రావటం లేదు. అధికారులు, పాలకులు స్పందించి తారురోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయాలి.

సంక్షిప్తంగా..

ముగిసిన అమ్మవారి మహోత్సవాలు

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణిదుర్గ అమ్మవారి మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఆఖరి రోజు ఆలయం ఆవరణలో జయాది హోమం నిర్వహించినట్లు ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

పూర్వవైభవం తీసుకురావాలి

హిరమండలం: పౌరాణిక కళలకు పూర్వ వైభవం తీసుకురావాలని కళాకారులు ఆకాంక్షించారు. హిరమండలంలోని సుబలాయిలో చీమకుర్తి కళాపీఠం ఆధ్వర్యంలో కళాకారులు బుధవారం ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తేనె తెలుగు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పెద్దరికం సాయి, అంజనప్పన్న, బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కళాకారులు ఒకచోటకు చేరారు. నాటి పౌరాణిక కళా వైభవం గురించి చర్చించారు. నాటి సంగతులను గుర్తుచేసుకున్నారు. తెలుగు పద్యాల గురించి కూడా చర్చించారు. సీనియర్ కళాకారులు లింగమూర్తి, గేదెల సుందరనారాయణ, చల్ల మన్మథరావు, సత్యం మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఆమదాలవలస: కార్మిక చట్టాలపై ప్రతీ ఒక్క కార్మికుడికి అవగాహన ఉండాలని లీగల్ సెల్ అధికారి బి.రమ్య సూచించారు. బుధవారం ఆమదాలవలసలో గల మార్కెట్ యార్డ్ ఆవరణలో గల మార్కెట్ కమిటీ కార్యాలయంలో అసంఘటిత కార్మికుల వారోత్సవాల్లో భాగంగా రాష్ట్ర, జిల్లా న్యాసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపు సత్యనారాయణ, సభ్యుడు పి.వి.నరసింహులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. పలు పూజా కార్యక్రమాలు, యాగశాల ప్రతిష్ఠ వంటివి బుధవారం చేపట్టారు. అనంతరం స్వామివారి తిరువీధి నిర్వహించారు.

నేటి నుంచి నృత్య శిక్షణ శిబిరం..

ఆమదాలవలస: పట్టణంలోని నాట్యశ్రీ నృత్య కళా నికేతన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి వేసవి నృత్యశిక్షణ శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు నృత్య దర్శకురాలు కూన శ్రీలత బుధవారం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులకు కూచిపూడి నృత్యంలో తర్ఫీదు ఇస్తామన్నారు. దూరప్రాంతాలకు చెందిన వారికి ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహికులైన విద్యార్థులు ఉదయం 8 గంటలకు శ్రీవేంకటేశ్వర కల్యాణ మండపం సమీపంలో గల నృత్య కళానికేత్‌ను సంప్రదించాలన్నారు.

పరామర్శ..


అప్పన్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి రెండో వార్డు కృష్ణాపురం గ్రామానికి చెందిన పొన్నాడ అప్పన్న ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం బుధవారం పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్టీ నాయకులు మెట్ట కృష్ణ, సనపల అనంతరావు, కూన సురేష్, పైడి మురళి, మెట్ట హరీష్, పొన్నాడ సంగమయ్య, తదితరులు ఉన్నారు.

